

టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు పలికాయి.



కిలో టమాట రూ.6

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ట ధర రూ.6, కనిష్టంగా రూ.3 మేర పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
38.5°/22.9°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నారసింహా.. నమోస్తుతే



భూదేవి, శ్రీదేవి సమేతంగా సింహవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఉరవకొండ: బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెన్నహోబిళం లక్ష్మీనృసింహస్వామి గురువారం సింహ, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకలకు జిల్లా నలమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాల అనంతరం పుష్పాలతో అలంకరించి వేదపండితుల ఆధ్వర్యంలో భూదేవి, శ్రీదేవి సమేత స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం నరసింహ స్వామి దుష్టశిక్షణ, శిష్టజన రక్షణకు సంకేతంగా నిలిచే సింహ వాహనంపై విహరించారు. సింహబలమంత భక్తి ఉన్నవారికి స్వామి అనుగ్రహం లభిస్తుందని నమ్మకం. అనంతరం స్వామి చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, మయూరం బాలాజీ, గుండురావు పాల్గొన్నారు.

పల్లెల్లో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ శ్రీనివాసరావు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

యల్లనూరు: పల్లెల్లో అలజడి సృష్టిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదని ఎస్పీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. గురువారం యల్లనూరు, వెన్నపూసపల్లి, దుగ్గుపల్లి, కల్లూరు, దంతలపల్లి, తిమ్మంపల్లి, బుక్కాపురం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. మట్కా, పేకాట, చైన్‌స్నాచింగ్ అరికట్టాలని ఆదేశించారు. ఇటీవల దంతలపల్లిలో చోటుచేసుకున్న ఇరు వర్గాల ఘర్షణపై ఆరా తీశారు. హింసాత్మక చర్యలకు పాల్పడిన వారిని వదలొద్దన్నారు. ఆయన వెంట తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, పుట్లూరు సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



అనంతపురం: కేసుల సత్వర పరిష్కారానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 13న (రెండో శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, చెక్ బౌన్స్, వినియోగదారుల ఫోరం, పంచాయతీ ట్యాక్స్, మున్సిపల్ ట్యాక్స్, ప్రీలిటిగేషన్, మోటారు వాహన ప్రమాద కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని వారు సూచించారు.

'విదేశీ విద్యా దీవెన'కు దరఖాస్తులు



అనంతపురం రూరల్: అర్హులైన విద్యార్థులు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైతే ప్రపంచంలోని టాప్ 334 యూనివర్సిటీల్లో విద్యనభ్యసించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు jnanabhumi.ap.gov.in// వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సంక్షేమ శాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

వైద్యమస్తు!



జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి ఇంటికే వెళ్లి పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నాడు..

టీడీపీ హయాంలో ఆస్పత్రులు అధ్వానంగా ఉండేవి. పీహెచ్‌సీకి వెళ్తే డాక్టర్ ఉంటారో లేదో తెలియదు. ఒకవేళ ఉన్నా మందులుండేవి కావు. వైద్యపరీక్షలు చేసేవారూ కరువు. చిన్న రోగమొచ్చినా సుదూరంలో ఉన్న ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి.

నేడు

గ్రామాల్లోనే వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటవుతున్నాయి. పీహెచ్‌సీలు కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో రూపుదిద్దుకున్నాయి. నిత్యం ఇద్దరు వైద్యులు ఉంటూ సేవలు అందిస్తున్నారు. గ్రామాలకు 104 వాహనాలు క్రమం తప్పకుండా వస్తున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రవేశ పెట్టాక పల్లెలకే డాక్టర్లు వస్తున్నారు. గ్రామీణులకు పైసా ఖర్చు లేకుండా ఉన్న ఊర్లోనే వైద్య పరీక్షలు చేస్తున్నారు. 170 రకాల మందులు ఇస్తున్నారు.

- విజయవంతంగా ఫ్యామిలీ డాక్టర్
- మారుమూల పల్లెలకూ వైద్యుల రాక
- ఉమ్మడి జిల్లాలో 7 నెలల్లోనే 5.50 లక్షల మందికి సేవలు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రక్తపరీక్షలతో పాటు మందులు అందజేత
- కేన్సర్ బాధితుల ఇళ్లకే వెళ్లి సూచనలు, సలహాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వైద్య రంగ స్వరూపం పూర్తిగా మారిపోయింది. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న సంకల్పంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతులు సమకూర్చారు. ఈ క్రమంలోనే ఆయన ప్రవేశపెట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం పేద రోగులకు వరంలా మారింది. దేశంలో ఎక్కడా లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రంలో అమలవుతున్న ఈ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే డాక్టర్లు వచ్చి పరీక్షలు చేసి మందులు ఇస్తుండడంతో పల్లెప్రజలు మురిసిపోతున్నారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, మూర్ఛవ్యాధిగ్రస్తులు.. ఒకరేమిటి రోగులందరికీ ఇంటిదగ్గరే వైద్యం అందుతుండడంతో వారి ఆనందం అంతా ఇంతా కాదు. ఒకప్పుడు సుదూరంలో ఉన్న ఆస్పత్రికి ఆటోలోనో, బస్సులోనో అవస్థలు పడుతూ వెళ్లే పరిస్థితి ఉండేదని, నేడు ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామాలకే వైద్యులు వస్తుండడంతో ఆ భారం తప్పిందని గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి అనంతలో ఐదున్నర లక్షల మందికి..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానం విజయవంతంగా సాగుతోంది. మారుమూల గ్రామాలకూ డాక్టర్లు వెళ్లి రోగులను పలకరిస్తూ ఉంటే నిజంగా మన ఊర్లోకే డాక్టర్లు వచ్చారా అన్నంతగా రోగులు ఆశ్చర్యపోతున్నారు.



శింగనమల మండలం సి.బండమీదపల్లిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కూడా వెళ్లే అవసరం లేకుండా పల్లెలోకే వచ్చి సేవలందిస్తుండటాన్ని గొప్పగా భావిస్తున్నారు. ఇప్పటివరకూ అనంతపురం జిల్లాలో 2.81 లక్షల మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 2.61 లక్షల మంది ఈ విధానం ద్వారా సేవలు పొందారంటే గ్రామీణులకు ఎంతగా ఈ విధానం మేలు చేస్తోందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలిలా.. (2022 అక్టోబర్- 2023 ఏప్రిల్ గణాంకాలు)	
వైద్యం పొందిన వారు	2,81,009
జనరల్ ఓపీ	1,13,576
యుక్తవయసు వారు	573
గర్భిణులు	33,580
బాలింతలు	16,211
రక్తహీనత బాధితులు	995
హైపర్ టెన్షన్	59,954
మధుమేహం	43,067
మధుమేహం-బీపీ	10,895
ఓరల్ కేన్సర్	833
రొమ్ము కేన్సర్	132
సర్వైకల్ కేన్సర్	1,149
టీబీ	44

చాలా ఉపయోగం



మాగ్రామానికి ఫ్యామిలీ డాక్టర్ వస్తున్నారు. అందరికీ వైద్య పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నారు. దీంతో ప్రైవేట్ డాక్టర్ల వద్దకు వెళ్లకుండా ఇక్కడే చూపించుకుంటున్నాం. చాలా ఉపయోగకరంగా ఉంది. వైద్య శిబిరం వద్దకూ రాలేని వారి ఇంటికే వెళ్లి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు.
– యల్లమ్మ సీ.బండమీదపల్లి, శింగనమల మండలం.

సేవలు బాగున్నాయి



'ఫ్యామిలీ డాక్టర్' విధానం బాగుంది. వైద్యులు అన్ని రకాల వైద్య సేవలందిస్తున్నారు. బీపీ, షుగర్ టెస్ట్‌లు చేస్తున్నారు. రక్త పరీక్ష, హెచ్‌బీ పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నారు. డాక్టర్లు బాగా చూస్తున్నారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం పల్లెలకే వైద్యుల్ని పంపుతుండటం హర్షణీయం.
– నసీమా, గర్భిణి, శింగనమల

గ్రామీణుల్లో సంతోషం



ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతి గ్రామాన్ని సందర్శించాలనేది మా లక్ష్యం. దీంతో పల్లెల్లో ఉన్న పరిస్థితులు డాక్టర్లకు తెలుస్తాయి. పేద ప్రజల ఇంటిదగ్గరకే డాక్టర్లు వస్తే అంతకంటే సంతోషం మరొటి ఉండదు. వైద్యులు పల్లెలకు వెళ్లినప్పుడు స్థానికులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
– డాక్టర్ వీరబ్బాయి, జిల్లా వైద్యాధికారి

నాణ్యమైన విత్తనం సరఫరా చేయాలి

- డీఏఓ చంద్రానాయక్



సీడ్ సెల్ ఏఓ, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఇన్‌చార్జ్‌లతో మాట్లాడుతున్న డీఏఓ చంద్రానాయక్

అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి ప్రారంభం కానున్న 2023 ఖరీఫ్‌కు నాణ్యమైన విత్తన వేరుశనగ సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ ఆదేశించారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సీడ్ విభాగం ఏఓ రాకేష్‌నాయక్‌తో కలిసి ప్రాసెసింగ్ ప్లాంట్ల ఇన్‌చార్జ్ ఏఓలతో సమావేశం నిర్వహించారు. మే చివరి వారంలో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీకి సహకరించాలన్నారు. ఈ సారి జిల్లాకు 78,245 క్వింటాళ్ల కే-6తో పాటు కదిరి-లేపాక్షి 1812 రకం విత్తన వేరుశనగ కేటాయించారని, వీటిని మండలాల వారీగా కేటాయింపులు చేశామన్నారు. మండల స్థాయి ఏఓలు ఆర్‌బీకే వారీగా కేటాయింపులు చేస్తారని తెలిపారు. విత్తన వేరుశనగతో పాటు కందులు, చిరుధాన్యాల విత్తనాలు కలిపి 1.17 లక్షల క్వింటాళ్లు కేటాయించారని పేర్కొన్నారు. ఆర్‌బీకే వేదికగానే రైతులకు విత్తన పంపిణీ చేస్తామన్నారు. ప్రాసెసింగ్ ప్లాంట్లలో విత్తనశుద్ధి సజావుగా జరిగేలా, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సారి చిరుధాన్యాల పంటల విస్తీర్ణం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పంటల సాగుకు ముందుకు వచ్చే రైతులను ప్రోత్సహిస్తామని తెలిపారు. త్వరలో విత్తన ధరలు, రాయితీలు, పంపిణీ మార్గదర్శకాలు విడుదల కానున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రాసెసింగ్ ప్లాంట్ల ఇన్‌చార్జ్ ఏఓలు వాసుకీరాణి, అర్చన, సాయిలక్ష్మి, విజయకుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ముస్తాక్ అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాగల మూడు రోజులూ వర్షాలు!



అనంతపురం అగ్రికల్చర్: రాగల మూడు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.అశోక్‌కుమార్ గురువారం విడుదల చేసిన వాతావరణ బులెటిన్‌లో పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షం పడే అవకాశం ఉందన్నారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 36.2 నుంచి 37.8 డిగ్రీలు, కనిష్టంగా 24.2 నుంచి 25.8 డిగ్రీల మధ్య నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ ఉదయం 73 నుంచి 85, మధ్యాహ్నం 46 నుంచి 55 శాతం మధ్య రికార్డు కావచ్చని తెలిపారు. వాయువ్య దిశగా గాలులు గంటకు 3 నుంచి 4 కిలో మీటర్ల వేగంతో వీస్తాయన్నారు. రైతులు పంట ఉత్పత్తులను జాగ్రత్తగా నిల్వ చేసుకోవాలన్నారు. నీటి తడులు తగ్గించాలని, పురుగుల మందు పిచికారీ తదితర జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జాగ్రత్త.. జాగ్రత్త

- వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్ గౌతమి



అనంతపురం అర్బన్: జిల్లాలో శని, ఆదివారాల్లో వర్షం కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎమ్.గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ డివిజన్ల వారీగా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇళ్లు కూలిపోవడం, ప్రాణ నష్టం తదితరాలపై తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని, వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలని ఆదేశించారు. ఎంపీడీఓలు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని, పారిశుధ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. పంట నష్ట వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకూడదని చెప్పారు. పశునష్ట వివరాల జాబితాను సోషల్ ఆడిట్ కోసం రైతు భరోసా కేంద్రాల్లో తప్పనిసరిగా ఉంచాలన్నారు. పశుగ్రాసం సిద్ధం చేసుకోవాలన్నారు. రైతుల నుంచి సేకరించిన వరి, పప్పుశనగను గోదాముల్లో భద్రపరచాలన్నారు. పంట నష్టపరిహారం కోసం వేసిన పంటకు బదులు మరొక పంట నమోదు చేయకూడదని చెప్పారు. చెరువులకు గండి పడే అవకాశం ఉన్నచోట తగిన చర్యలు చేపట్టాలని చిన్ననీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు.

10 మండలాల్లో వర్షం

బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ 10 మండలాల పరిధిలో 4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. నార్పల 32.6 మి.మీ, ఉరవకొండ 23.6 మి.మీ, శింగనమల 18.4 మి.మీ, వజ్రకరూరు 16.8 మి.మీతో పాటు అనంతపురం, ఆత్మకూరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, పామిడి, విడపనకల్లు తదితర మండలాల్లో వర్షపాతం నమోదైంది. మే నెల సాధారణం 36.7 మి.మీ కాగా ఇప్పటికే 27 మి.మీ నమోదైంది.

నేడు మంత్రి విడదల రజిని రాక

అనంతపురం క్రైం: రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని శుక్రవారం అనంతపురం రానున్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆమె పరిశీలిస్తారని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. మంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం ఆయన ఆస్పత్రిలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ వైవీ రావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలోని రూ.3.46 కోట్లతో ఏర్పాటు చేస్తున్న బర్న్స్ (30 పడకలు) వార్డుతో పాటు ఇతర వార్డులు, ఆపరేషన్ థియేటర్‌ను మంత్రి పరిశీలిస్తారన్నారు. మెయిన్ ఆపరేషన్ థియేటర్ సమీపంలో పెయిన్ రిలీఫ్ క్లినిక్ (ఓపీ నెంబర్ 39) ప్రారంభిస్తారన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరాలజీ, కార్డియాలజీ విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్ సందర్శిస్తారన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వివిధ విభాగాధిపతులతో సమావేశమవుతారని వెల్లడించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఆ ప్రాంతాలను మరింత శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. రోగులకందించిన ఉత్తమ సేవలకు సంబంధించి గణాంకాలు పక్కాగా ఉండాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు.

అందుకోండి పెళ్లికానుక

- నేడు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా నిధుల విడుదల
- జిల్లాలోని 860 మంది తల్లుల ఖాతాల్లో రూ. 2.48 కోట్లు జమ

అనంతపురం: నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు తనవంతు సాయంగా కానుక అందించేందుకు వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ కేటగిరి వారికి రూ. లక్ష, ఎస్సీ కేటగిరి వారు కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, ఎస్టీ కేటగిరి వారు కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, బీసీలు కులాంతర వివాహం చేసుకుంటే రూ.75 వేలు, మైనార్టీలకు రూ. లక్ష (వైఎస్సార్ షాదీ తోఫా), దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు రూ.40 వేల మేర ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోంది. ఈ మేరకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 860 మంది తల్లుల ఖాతాల్లో మొత్తం రూ.2.48 కోట్లు శుక్రవారం జమ కానున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి నేరుగా నిధులు విడుదల చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఐ. నరసింహా రెడ్డి తెలిపారు. కూడేరు మండలంలో అత్యధికంగా 16 మంది, కణేకల్లు 12, పెద్దవడుగూరు 8, గుత్తి, ఉరవకొండ మండలాల్లో ఏడుగురు చొప్పున, అనంతపురం రూరల్, ఆత్మకూరు, పామిడి మండలాల్లో ఐదుగురు చొప్పున లబ్ధిదారులు ఉన్నారు.

అక్కడికి వెళ్లరు.. ఇక్కడ పనిచేయరు

- ఐసీడీఎస్‌లో కాంట్రాక్టు ఉద్యోగుల నిర్లక్ష్యం
- శ్రీ సత్యసాయి జిల్లా వైపు కన్నెత్తి చూడని వైనం

అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమశాఖలో పాలన గాడి తప్పుతోంది. ఆ శాఖలో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులదే పెత్తనంగా మారుతోంది. బాలల హక్కుల పరిరక్షణ సమితి, గృహహింస నిరోధక విభాగం, వన్‌స్టాప్ సెంటర్ తదితర విభాగాల్లో కాంట్రాక్టు కింద సిబ్బంది పనిచేస్తారు. ఇటీవల జిల్లాల పునర్విభజన తర్వాత సగం మందిని ఆ జిల్లాకు బదిలీ చేసినా, నెల గడవకముందే యథాస్థానానికి చేరుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా వైపు కన్నెత్తి చూడడం లేదు. ఆ జిల్లాతో తమకు సంబంధం లేదన్న చందంగా వ్యవహరిస్తున్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల కట్టడి విషయంలో బాలల హక్కుల పరిరక్షణ సమితి కీలకంగా పనిచేయాల్సి ఉంటుంది. గ్రామీణ, మండల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పిస్తూ మహిళా, శిశుసంక్షేమం విషయంలో కీలకపాత్ర పోషించాల్సి ఉంది. కానీ ఉమ్మడి జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

నామమాత్రంగా సమావేశాలు..

జిల్లా సరిహద్దు మండలాల్లో ఇప్పటికీ మూఢనమ్మకాలు పాటిస్తున్నారు. బాలికలను బసివినులుగా మారుస్తున్నారు. ఇటీవల రాయదుర్గం నియోజకవర్గంలో ఇలాంటి ఉదంతం వెలుగుచూసింది.



బాల్య వివాహాలు కూడా అధికంగా జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించి దురాచారాలను దూరం చేయాల్సిన ఐసీడీఎస్ అధికారులు కేవలం జిల్లా కేంద్రం, తప్పితే పరిసర ప్రాంతాల్లోనే సమావేశాలు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

ముఖ్య అధికారి నిర్లక్ష్యం..

గతంతో పోలిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐసీడీఎస్ చాలా బలోపేతమైంది. అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు. ఖాళీలను తరచూ భర్తీ చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామానికో మహిళా పోలీసు కార్యకర్త పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకుంటున్నా, క్షేత్ర స్థాయిలో కొందరి అలసత్వం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఆ తరహాలోనే జిల్లా ఇన్‌చార్జ్ అధికారి కూడా ఓ కాంట్రాక్టు ఉద్యోగికి పెత్తనమంతా కట్టబెట్టడంతో వ్యవస్థకు మచ్చ తెస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతోనే శ్రీ సత్యసాయి జిల్లాను కూడా సమన్వయం చేసుకుని పనిచేయాల్సిన కాంట్రాక్టు ఉద్యోగులు జిల్లా కేంద్రంలో తిష్టవేసి పైరవీలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అనాథలు, నిరాశ్రయులైన చిన్నారులకు ప్రతి నెలా ఆర్థికసాయాన్ని అందించేందుకు మిషన్ వాత్సల్య అనే బృహత్తర పథకం తీసుకొచ్చింది. అయితే, ప్రచారం లేకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది ఈ పథకానికి దూరమవుతున్నారని తెలిసింది.

అవగాహన సదస్సులు లేకపోవడం వాస్తవమే

జిల్లాల పునర్విభజన తర్వాత ఐసీడీఎస్‌లో 50 శాతం సిబ్బందిని శ్రీ సత్యసాయి జిల్లాకు కేటాయించారు. తర్వాత కొన్ని కారణాల రీత్యా వారిని పాత జిల్లాకేంద్రంలోనే ఉంటూ నూతన జిల్లాలో కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, రక్షణ చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించపోవడం వాస్తవమే.
– లక్ష్మీకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్, శ్రీ సత్యసాయి జిల్లా

కల్వర్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గోరంట్ల: మండలంలోని బుడ్డపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న కల్వర్టులో గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తిగా అంచనా వేశారు. బ్లూజీన్స్ ప్యాంటు, పాచి కలర్ ఫుల్‌హ్యాండ్స్ టీ షర్టు ధరించాడు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. నాలుగైదు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు.

జిల్లాలో బౌద్ధమత ఆనవాళ్లు

అనంతపురం కల్చరల్: బుద్ధం శరణం గచ్ఛామి.. సంఘం శరణం గచ్ఛామి అంటూ శాంతికి ప్రతి రూపమైన గౌతమ బుద్ధుడి ఆనవాళ్లు జిల్లాలోనూ ఉన్నాయి. శతాబ్దాల క్రితం నాటి బుద్ధుడి స్మృతి చిహ్నాలను దశాబ్దాల క్రితమే జిల్లా చరిత్ర కారులు వెలుగులోకి తెచ్చారు. సిద్ధార్థుడిగా ప్రారంభమైన ఆయన జీవితం ఎన్నో సందేహాలతో తపోధనుడై.. తథాగతుడిగా మారిన తర్వాత ధార్మిక, ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్ముతూ ప్రపంచాన్ని శాంతి మార్గం వైపు గౌతమబుద్ధుడి జయంతిని శుక్రవారం జిల్లాలోనూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

గుత్తి సమీపంలో శాసనాలు

జిల్లాలోనూ బౌద్ధ మతం వ్యాప్తి చెందిందనేందుకు జిల్లా సరిహద్దుకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో లభ్యమైన పురాతన శాసనాలే నిదర్శనం.గుత్తి పట్టణ సమీపంలోని యర్రగుడి, కర్నూలు జిల్లాలోని జొన్నగిరి వద్ద లభ్యమైన అశోకుడి కాలం నాటి శిలా శాసనాల్లో బుద్ధిడి బోధనలు స్పష్టంగా పేర్కొన్నారు. బ్రాహ్మి లిపిలో పెద్ద రాతి బండలపై లిఖించిన శాసనాల్లో బుద్ధుడి సూక్తులున్నట్లు పరిశోధకులు కనుగొన్నారు.





పీస్ మెమోరియల్ హాలులో భద్రపరిచిన క్రీ.శ. 3వ శతాబ్దం నాటి బుద్ధుడి విగ్రహం, యర్రగుడి వద్ద బౌద్ధ మత శాసనమున్న ప్రాంతం

బుద్ధుని ప్రతిరూపాలు

'మహాబోధి సాహిత్య వేదిక'ను ప్రారంభించిన దాసన్నగారి కృష్ణమూర్తి... బౌద్ధ అనుయాయులతో కలసి అనంతపురంలోని హౌసింగ్‌బోర్డులో బుద్ధ విహార్ ప్రాజెక్టు నేతృత్వంలో బౌద్ధ ధర్మాన్ని చాటుతున్నారు. 2019లో బుద్ధ పార్కు ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో బుద్ధుడి సమగ్ర సమాచారంతో కూడిన ఎన్నో పుస్తకాలున్నాయి. అలాగే నగరంలోని పీస్ మెమోరియల్ హాలులోకి అడుగు పెట్టగానే నిలువెత్తు బుద్ధుని చరిత్ర తెలిపే పెయింటింగ్స్, తవ్వకాల్లో బయటపడిన క్రీ.శ.3వ శతాబ్దం నాటి విగ్రహం ఆకట్టుకుంటాయి.

నేడు బుద్ధ వందనం

బుద్ధ జయంతిని పురస్కరించుకుని బుద్ధ విహార్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నగరంలోని బుద్ధ పార్కులో బుద్ధ వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుద్ధుడి జీవితంపై ప్రసంగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వైశాఖ పౌర్ణమి కావడంతో పలు ఆలయాల్లోనూ విశేష పూజలు జరుగనున్నాయి.

వృద్ధుడి ఆత్మహత్య



మృతుడు నారాయణ

గుంతకల్లు రూరల్: జీవితంపై విరక్తితో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలం నాగసముద్రం నివాసి మేకల నారాయణ (85), తిమ్మక్క దంపతులకు ఏడుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు చేశారు. ఓ కుమార్తెను తమ వద్దే ఉంచుకుని అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నారు. పదేళ్ల క్రితం అనారోగ్యంతో తిమ్మక్క మృతి చెందింది. రెండేళ్ల క్రితం నారాయణకు కంటి చూపు మందగించడంతో కుటుంబసభ్యులు ఆపరేషన్ చేయించారు. అప్పటి నుంచి కంటి నొప్పితో బాధపడేవాడు. చికిత్స చేయించినా నొప్పి తగ్గలేదు. గురువారం ఉదయం కంటి నొప్పి భరించలేక ఇంట్లో ఉన్న థిమేట్‌ను నీటిలో కలుపుకుని తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: బాలికను వంచించిన కేసులో ఓ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అనంతపురం వన్‌టౌన్ సీఐ రవి శంకరరెడ్డి తెలిపారు. ఉరవకొండ ప్రాంతానికి చెందిన ఓ బాలిక అనంతపురంలో విద్యనభ్యసిస్తోంది. ఈ క్రమంలో కడమలకుంటకు చెందిన సుధీర్ నాలుగు రోజుల క్రితం ఆ బాలికను కలసి మాయ మాటలతో తన వెంట తీసుకెళ్లాడు. ఘటనకు సంబంధించి అప్పట్లో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. గురువారం ఉదయం సుధీర్ ఆచూకీ పసిగట్టి అదుపులోకి తీసుకుని బాలికతో పాటు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారణ అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు సుధీర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి



సర్కిల్ చిత్రపటాన్ని పరిశీలిస్తున్న అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి

అనంతపురం: పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి ఆదేశించారు. ఇటుకలపల్లి సర్కిల్ కార్యాలయాన్ని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో కీలక భూమిక పోషించే విజిబుల్ పోలీసింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడు సంతోషంగా, సంతృప్తితో తిరిగి వెళ్లేలా వ్యవహరించాలన్నారు. మహిళా పోలీసులను సమన్వయం చేసుకుని నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇటుకలపల్లి సీఐ మోహన్, ఎస్సై శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి మొక్కజొన్న కొనుగోళ్లు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని 10 మండలాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ఈనెల 8వ తేదీ నుంచి మొక్కజొన్న పంట కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం క్వింటాకు రూ.1,962 మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు 430 మంది రైతులు ఆర్‌బీకేల ద్వారా డి-కృషి యాప్‌లో పేర్లు నమోదు చేసుకున్నారని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ల ఆధారంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తామన్నారు. ఈ-క్రాప్ ఆధారంగా కొనుగోళ్లు చేపట్టి, మూడు వారాల్లోపు రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తామన్నారు. ఈ రబీలో 12,083 హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగైనట్లు ఈ-క్రాప్ నివేదిక చెబుతోందని పేర్కొన్నారు.



హెక్టారుకు సగటున 6,982 కిలోల ప్రకారం 83,466 మెట్రిక్ టన్నుల దిగుబడులు రానున్నట్లు అంచనా వేశామన్నారు. కాగా ఈ సీజన్‌లో 1,961 మంది రైతుల నుంచి క్వింటా ఎంఎస్‌పీ రూ.5,335 ప్రకారం 4,616 మెట్రిక్ టన్నులు పప్పుశనగ కొనుగోలు చేశామన్నారు. అందులో ఇప్పటికే 1,514 మంది రైతులకు చెల్లింపులు కూడా పూర్తయినట్లు ఆమె వెల్లడించారు.

బ్యాంక్ ఖాతా నుంచి నగదు గల్లంతు



బాధితురాలు పుష్పలత

కుందుర్పి: ఖాతాదారుకు తెలియకుండా ఆమె బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయమైంది. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కుందుర్పి మండలం కదరం పల్లికి చెందిన మహిళారైతు పుష్పలతకు స్థానిక కెనరా బ్యాంక్‌లో ఖాతా ఉంది. 15 రోజుల క్రితం తన ఖాతాలోకి ఆమె రూ.36 వేలు జమ చేసింది. గురువారం డబ్బు అవసరం కావడంతో బ్యాంక్‌కు చేరుకుని నగదు విత్‌డ్రాకు ప్రయత్నించింది. అయితే ఖాతాలో రూ.2 వేలు మాత్రమే ఉన్నట్లు బ్యాంక్ అధికారులు తెలపడంతో ఆమె అవాక్కైంది. విషయం తెలుసుకున్న బ్యాంక్ మేనేజర్ ఆమె ఖాతాను పరిశీలించారు. ఆమె ఆధార్ నంబర్ ఆధారంగా ఈ నెల 2న రూ.10వేలు చొప్పున మూడు పర్యాయాలు, మరోసారి రూ.4వేలు కలిపి మొత్తం రూ.34వేలు డ్రా చేసినట్లు గుర్తించి, విషయాన్ని బాధితురాలికి వివరించారు. ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో బళ్లారి వాసి మృతి



మృతుడు పెద్దన్న

ఉరవకొండ: పొట్టకూటి కోసం పనిలో నిమగ్నమైన వ్యక్తి.. విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని శివరామిరెడ్డి కాలనీకి చెందిన నారాయణ 15 రోజుల క్రితం ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశాడు. కొత్త ఇంటికి పెయింటింగ్ వేయించేందుకు బళ్లారికి చెందిన పెద్దన్న (45)కు కాంట్రాక్ట్ ఇచ్చాడు. ఈ క్రమంలో నాలుగు రోజులుగా నారాయణ ఇంటికి పెయింట్ వేసే పనిలో పెద్దన్న నిమగ్నమయ్యాడు. గురువారం ఉదయం పనిలో నిమగ్నమైన పెద్దన్న.. మిద్దెకు సమీపంలో వెళుతున్న 11 కేవీ విద్యుత్ తీగల వద్ద పెయింటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు చేతిలో ఉన్న రోలర్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న బళ్లారిలోని పెద్దన్న భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులు హుటాహుటిన ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి చేరుకుని పెద్దన్న మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి



మృతుడు షరీఫ్

యల్లనూరు: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్‌లు వేసేందుకు ప్రయత్నించిన ఓ రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన శింగనమల షరీఫ్ (50)కు భార్య, నలుగురు పిల్లలున్నారు. తనకున్న పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లిన షరీఫ్.. అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎగిరిపోయిన ఎగ్జిట్ ఫ్యూజ్‌లు గుర్తించి, వేస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న షరీఫ్‌ను చుట్టుపక్కల రైతులు గుర్తించి, కుటుంబసభ్యులతో కలసి పులివెందులలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శభాష్ పోలీస్



తల్లీబిడ్డలతో కూడేరు ఎస్ఐ, సిబ్బంది

ఉరవకొండ (కూడేరు): కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన ఓ మహిళ, ఆమె ఇద్దరు బిడ్డలను కూడేరు పోలీసులు కాపాడారు. పలువురి ప్రశంసలు అందుకున్నారు. వివరాలు.. అనంతపురం నగరంలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన ఓ మహిళ, తన ఇద్దరు ఆడపిల్లలను తీసుకుని ఇంటి నుంచి గురువారం వెళ్లిపోయింది. ఈ ముగ్గురు పురుగుల మందు తాగి చనిపోవాలనుకొని నిర్ణయించుకుని వెళ్లిపోయినట్లు స్థానికుల ద్వారా డయల్ 100కు సమాచారం అందింది. ఫోన్ నంబర్ ఆధారంగా కూడేరు మండలం కమ్మూరు, గొట్కూరు మధ్య పొలాల్లో వీరు ఉన్నట్లు కనుగొన్న పోలీసులు కూడేరు సిబ్బందిని అప్రమత్తం చేశారు. సమాచారంతో వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న కూడేరు ఎస్ఐ సత్యనారాయణ.. తల్లీబిడ్డలను కాపాడారు. కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి వారిని అప్పగించారు. సకాలంలో స్పందించి ముగ్గురి ప్రాణాలను కాపాడిన కూడేరు ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. కాగా, సదరు మహిళ భర్త అప్పులు ఎక్కువ కావడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు తెలిపింది. దీంతో ఆమె పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని వెళ్లినట్లు విచారణలో తేలింది.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్ర

ఉరవకొండ: పెన్నహోబిళం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని ఆర్డీఓ రవీంద్ర, డీఎస్పీ నర్సింగప్ప పిలుపునిచ్చారు. ఆలయ ఈఓ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన గురువారం ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్, భోజన వసతి కల్పించాలన్నారు. భక్తులు సకాలంలో స్వామి రథోత్సవానికి చేరుకునేలా ఆర్టీసీ సర్వీసులు నడపాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో అదనపు కొళాయిలు ఏర్పాటు చేసి తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ నర్సింగప్ప మాట్లాడుతూ రథోత్సవానికి సీఐ, ఎస్ఐలతో పాటు సీఆర్‌ఎఫ్ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసు అవుట్ పోస్టు ద్వారా నిరంతరం భక్తులకు పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో తహసీల్దార్ సయ్యద్‌షాబుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్, అర్బన్ సీఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి, పెన్నహోబిళం ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకానాచార్యులు, ఆర్టీసీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఈకేవైసీకి కాలపరిమితి వద్దు

- ఖజానా శాఖ జేడీకి విన్నవించిన పెన్షనర్లు



జేడీ శ్రీనివాసులు నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు, చిత్రంలో డీడీ సరళ విజయకుమారి

అనంతపురం అర్బన్: పెన్షనీర్లకు సంబంధించి ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు కాలపరిమితి విధించకూడదంటూ ఖజానా శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు నాయక్‌కు ప్రభుత్వ పెన్షనీర్ల సంఘం నాయకులు విన్నవించారు. గురువారం జిల్లా ఖజానా శాఖ డీడీ చాంబర్‌లో జాయింట్ డైరెక్టర్‌ను సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెద్దన్నగౌడ్, జయరామప్ప, ఇతర సభ్యులు కలసి వినతిపత్రం అందజేసి, సమస్యలు వివరించారు. ఈకేవైసీ చేయించుకునే అంశంలో వయోభారం, అనారోగ్య కారణాల వల్ల చాలా మంది సకాలంలో రాలేని పరిస్థితి ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ఈకేవైసీ నమోదుకు కాలపరిమితి పెట్టడం భావ్యం కాదన్నారు. ఇప్పటికీ లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వని పెన్షనీర్ల వివరాల జాబితాను తమ సంఘానికి అందజేస్తే వారికి సమాచారం అందజేసి లైఫ్ సర్టిఫికెట్ ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే అర్హులైన అందరితోనూ తమ సంఘం ద్వారా ఈకేవైసీ చేయిస్తామని భరోసానిచ్చారు. పెన్షనీర్లకు సంబంధించి మరి కొన్ని సమస్యలను వివరించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, నారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, కిష్టప్ప, అనంతయ్య పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి



శింగనమల: విద్యుత్ షాక్‌కు గురై 13 గొర్రెలు మృతి చెందాయి. స్థానిక రైతులు తెలిపిన మేరకు... శింగనమల మండలం వెస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం గ్రామ శివారులోని మెట్ట పొలాల్లోకి గొర్రెలను మేపునకు తోలుకెళ్లాడు. చుట్టూ తిరుగుతూ సాయంత్రానికి గ్రామానికి చేరుకుంటుండగా మార్గమధ్యంలో తెగిపడిన 11 కేవీ విద్యుత్ లైన్‌ను గొర్రెలు తాకాయి. దీంతో షాక్‌కు గురై 13 గొర్రెలు మృతి చెందాయి. రైతుల నుంచి సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. ఘటనతో దాదాపు రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు కాపరి నారాయణస్వామి తెలిపారు. కాగా, గురువారం తెల్లవారుజామున పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలోనే 11కేవీ విద్యుత్ లైన్ తెగిపడిందని, విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించి ఉంటే గొర్రెలు మృతి చెంది ఉండేవి కాదని ఈ సందర్భంగా పలువురు రైతులు పేర్కొన్నారు.

'తపాలా' బదిలీలకు రంగం సిద్ధం

- సీనియారిటీ జాబితా సిద్ధం
- 15వ తేదీలోపు కౌన్సెలింగ్

అనంతపురం సిటీ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన తపాలా శాఖలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఏటా మే నెలలో బదిలీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతపురం డివిజన్‌లోని సబ్, బ్రాంచ్ పోస్టాఫీసుల్లో మూడేళ్లు, ఆరేళ్ల ఒకే చోట పని చేసిన వారికి బదిలీలు అనివార్యమయ్యాయి. ఇందుకు సంబంధించిన సీనియారిటీ జాబితాను అధికారులు సిద్ధం చేశారు. మొత్తం 14 మంది సబ్ పోస్ట్‌మాస్టర్లు, 38 మంది పోస్టల్ అసిస్టెంట్లను బదిలీలకు అర్హులుగా తేల్చారు.

సీనియారిటీ జాబితా ఇలా..

జిల్లాలోని గుంతకల్లులోని ఖాశీమోదీనాబాద్, పాత గుంతకల్లు, రాజేంద్రనగర్, ఏపీఎం మెయిల్స్, ఇన్‌చార్జ్ సీపీసీ, మార్కెట్, హనుమేష్ నగర్, అనంతపురం పరిధిలోని జేఎన్‌టీయూ, గాంధీ బజార్, సాయినగర్‌తోపాటు పామిడి, యాడికి, యల్లనూరు, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం బజార్, పెద్దవడుగూరు, శెట్టూరు సబ్ పోస్టాఫీసు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన సబ్ పోస్ట్‌మాస్టర్లలో డీఆర్ రాజశేఖర్, ఎస్.నూరుల్ హుదా, డి.కంబయ్య, వై.గౌస్ పీరాన్, బీఎం జిలాన్, పుర్యానాయక్ ఉన్నారు. మూడేళ్ల సర్వీసు కలిగిన వారిలో కె.రవీంద్రనాయక్, సి.దేవదాస్, బి.కిరణ్, జీడీ మల్లికార్జున, సి.రాముడు(సస్పెన్షన్), ఆర్.ఎస్.మదన్ లాల్, బి.పుర్యానాయక్, సి.రమేష్ మోహన్ ఉన్నారు. ఖాళీ స్థానాల్లో వీరు దేనికైనా ఆప్షన్ ఇచ్చుకునే వెసులుబాటు ఉంది.

జాబితాలో 18 మంది పోస్టల్ అసిస్టెంట్లు

జిల్లా వ్యాప్తంగా ఆరేళ్ల ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న పోస్టల్ అసిస్టెంట్లు 20 మంది ఉండగా, ఒకే చోట మూడేళ్ల సర్వీసు కలిగిన 18 మందికి ఈసారి స్థాన చలనం కలగనుంది. వీరి కోసం అనంతపురం హెచ్‌ఓ పరిధిలో 10 పోస్టులు, ఓల్డ్ టౌన్ ఎల్ఎస్‌జీ ఎస్‌ఓ పరిధిలో రెండు, కలెక్టరేట్, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీ ఉన్నాయి. గుంతకల్లు హెచ్‌ఓ పరిధిలో 8 పోస్టులు, గుత్తిలో మూడు, కళ్యాణదుర్గం ఎల్ఎస్‌జీ ఎస్‌ఓ పరిధిలో రెండు పోస్టులు ఖాళీ ఉన్నాయి. తాడిపత్రి, ఉరవకొండ, పామిడి, ఎస్‌వీ పురంలో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీ ఉన్నాయి.

ఆప్షన్లు కోరిన తపాలా శాఖ అధికారులు

బదిలీలకు సంబంధించి ఉద్యోగులకు తపాలా శాఖ అధికారులు వెసులుబాటు కల్పించారు. ఖాళీగా ఉన్న స్థానాలకు వారు ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఒక్కొక్కరు మూడేసి స్థానాలు చొప్పున సూచించవచ్చు. ఉద్యోగులు ఇచ్చిన ఆప్షన్‌ను బట్టి ఈ నెల 15వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ

గుమ్మఘట్ట: ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గానికి చెందిన నిజాముద్దీన్, హారీఫా, ఫౌజన్, రియాజ్, ఖలీల్ గురువారం ఉదయం భైరవాని తిప్ప ప్రాజెక్ట్ సందర్శనకు ఓ ఆటోలో బయలుదేరారు. గుమ్మఘట్టలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆటో బోల్తాపడింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురితో పాటు ద్విచక్ర వాహనంపై ఉన్న గుమ్మఘట్టకు చెందిన అమరేష్, నాగరాజు, శ్రుతి, వినోద్‌కుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో హారీఫా పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రథమ చికిత్స అనంతరం హారీఫా, ఫౌజన్, రియాజ్, ఖలీల్‌ను కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు.

ప్రశాంతి నిలయంలో ఘనంగా బుద్ధ పౌర్ణమి

ప్రశాంతి నిలయం: బుద్ధ పౌర్ణమి వేడుకలు ప్రశాంతి నిలయంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకరరాజు జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. సాయికుల్వంత్ సభా మందిరంలో బౌద్ధ గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సత్యసాయి మహాసమాధి వద్ద బౌద్ధ సంప్రదాయంలో పూజలు నిర్వహించారు. పలువురు బౌద్ధ ప్రముఖులు మాట్లాడుతూ.. సత్యసాయికి, బుద్ధ భగవానునికి మధ్య సారూప్యతను వివరించారు.

క్లుప్తంగా

ఈ-చలానాలు తీసేయండి



ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: బాడుగలు లేక ఆర్థిక ఇబ్బందులో ఉన్న ఆటో డ్రైవర్లపై ఈ-చలానాలు తీసివేయాలని ట్రాఫిక్ సీఐ వెంకటేశ్‌నాయక్‌కు ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు విన్నవించారు. సీఐని గురువారం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు శ్రీనివాసులు, తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు.

వేసవి వినోదాన్ని సద్వినియోగం చేసుకోండి



వేసవి వినోదం వివరాలను తెలియజేస్తున్న చిల్డ్రన్ క్లబ్ నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: చిన్నారులకు విజ్ఞానాన్ని, వినోదాన్ని, వికాసాన్ని అందించే సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని చిల్డ్రన్ క్లబ్ నిర్వాహకులు కోరారు. గురువారం స్థానిక గనే నాయక్ భవన్‌లో కన్వీనర్ నరసింహ, యూటీఎఫ్ జిల్లా నాయకులు లింగమయ్య, డాన్సుమాస్టర్ కుల్లాయిస్వామి, సురేష్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే వేసవి శిబిరంలో కథలు, కవితలు, డ్రాయింగ్, ఆటలు, పాటలు, దేశభక్తి గీతాలు తదితర 20 అంశాల్లో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు సెల్: 9490432343లో సంప్రదించాలన్నారు.

దూదేకుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలిగా రమీజా

అనంతపురం టవర్‌క్లాక్: దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలుగా రమీజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో కమిటీని ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా దూదేకుల పొలిటికల్ జేఏసీ అధ్యక్షులుగా కుళ్లాయిబాబును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబ్రహ్మ, తాడిపత్రి కతాలప్ప, మసూధ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు

రామగిరి: చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎలాంటి వారైనా చర్యలు తప్పవని రామగిరి సీఐ చిన్నగౌస్ హెచ్చరించారు. గురువారం కర్ణాటక సమీపంలోని గరిమేకలపల్లి గ్రామంలో యాదవకుల దేవత వీర ఓబుమ్మ జాతర సందర్భంగా ఎస్ఐ జనార్దన్ నాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మరో ఐదు రోజుల్లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా సమీపంలోని కర్ణాటక రాష్ట్రం తిరుమణి పోలీస్ స్టేషన్‌ను వారు సందర్శించారు.

ఆకతాయికి దేహశుద్ధి



ఆకతాయిని స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్తున్న ఓ మహిళపై భర్త ముందే అనుచితంగా ప్రవర్తించిన ఓ ఆకతాయికి దేహశుద్ధి చేశారు. వివరాలు.. గురువారం రాత్రి దంపతులు ఇద్దరు బస్టాండ్‌కు వెళ్తుండగా అక్కడే ఉన్న ఓ ఆకతాయి భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అడ్డుకోబోయిన భర్తపైనా దాడి చేశాడు. మత్తులో ఉన్న ఆకతాయిని స్థానికులు త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. ఆకతాయి పూర్తి వివరాలు తెలియదని ఎస్ఐ వలీబాషా తెలిపారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వైట్‌నర్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు సేవించేవాడని పోలీసులు తెలిపారు.

వైభవంగా బండిశిల రథోత్సవం

పెద్దవడుగూరు : మండలంలోని గుత్తిఅనంతపురం , కాశేపల్లి మీదుగా రెండో రోజు గురువారం బండిశిల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశేపల్లి, గుత్తిఅనంతపురం గ్రామాల రైతులు తమ ఎద్దులను ముస్తాబు చేశారు. సాయంత్రం ఎద్దులతో సుడిబండిని లాగించారు.

‘అనంత’ అభివృద్ధిపై ప్రజల్లో సంతృప్తి



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

● ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ‘సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై ప్రజల్లో అపారమైన విశ్వాసం ఉందని, నాలుగేళ్ల పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని 15, 16వ డివిజన్లలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్లు గూడూరు మల్లికార్జున, హసీనాలతో కలసి ఎమ్మెల్యే ‘అనంత’ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు. ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. నియోజకవర్గంలో రోడ్లు, కాలువల ఏర్పాటుకు మాత్రమే రూ.600 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్య వచ్చినా, పరిష్కారం చూపేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలకు చేసిన మేలును ధైర్యంగా చెప్తున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలైన ఇంతటి సాహసాన్ని చేశాయా? అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధితో ప్రతిపక్షాల మనుగడ కోల్పోయిన పరిస్థితి నెలకొనిందని ఎమ్మెల్యే అన్నారు. ఇలాంటి తరుణంలో ఎలాగైనా వారిని రాజకీయంగా బతికించేందుకు కొన్ని పత్రికలు తాపత్రయపడుతున్నాయన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి :

15వ డివిజన్‌లోని శ్రీనివాసనగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే వివిధ ప్రాంతాల్లో కాలువ, రోడ్లు ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. డీసీఎంఎస్ స్టోర్స్ ప్రాంతంలో రోడ్డుపై నీరు నిలుస్తోందన్న విషయాన్ని తెలుసుకున్న ఆయన రోడ్లు ఎత్తు పెంచాలని ఇంజినీర్లను ఆదేశించారు. 16వ డివిజన్‌లోని వెంకటరెడ్డి కాలనీలో నూర్‌మహమ్మద్, మున్ని, సుబహాన్‌లకు సాధారణ పింఛన్ నుంచి వికలాంగుల పింఛన్ వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ మాల్యవంతం మంజుల, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, జేఏసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, జయలలిత, రాజేశ్వరి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు పెన్నోబులేసు, బీసీ శేఖర్, సుకేష్, భారతి, గౌరి పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మేనేజర్ హిమబిందుకు దరఖాస్తులందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: ప్రభుత్వం బ్రాహ్మణుల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తోందని, బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. ఏపీ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అందిస్తున్న వివిధ రకాల సేవలు, పథకాలపై గురువారం స్థానిక పాతూరులోని చిన్నాంజనేయ స్వామి ఆలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. సొసైటీ మేనేజర్ హిమబిందు బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ బ్రాహ్మణులందరికీ అందుబాటులో ఉండే ఎన్నో పథకాలు అందిస్తోందన్నారు. చాలా మందికి అవగాహన లేక వినియోగించుకోలేక పోతున్నారని, ఇకపై ప్రతి చోట అవగాహనా సదస్సు నిర్వహించి వివరాలను తెలియజేస్తామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సేవా భావంతో బ్రాహ్మణులకు అందుబాటులో ఉండే విధంగా చిరువ్యాపారాలు, ఉద్యోగులకు, ఇళ్ల నిర్మాణాలు, స్వయం ఉపాధికి అన్ని విధాలా బ్రాహ్మణ సొసైటీ సేవలందిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే అప్పటికప్పుడు సభ్యులుగా చేరి పూర్తి చేసిన దరఖాస్తులను మేనేజర్ హిమబిందుకు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్ బాబా, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరువీధుల జగదీష్, మంజునాథ్, ఆలయ కమిటీ నిర్వాహకులు రఘునాథ్, మేనేజింగ్ ట్రస్టీ హరినారాయణ, కాశీవిశ్వేశ్వరాలయం చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సభ

ఆత్మకూరు: మండల కేంద్రంలో వైఎస్సార్ ఆసరా సభ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ గురువారం తెలిపారు. ఆసరా కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా సభ ఉదయం 9 గంటలకు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

9న ఉచిత ఖత్నా

అనంతపురం సిటీ: నగరంలోని రాణినగర్ బాహమి బైతుల్ మాల్ షాదీ మహల్ ఆవరణలో ఈ నెల 9న ఖత్నా (వడుగులు) కార్యక్రమం నిర్వహించనున్నట్లు బాహమి బైతుల్ మాల్ సంస్థ ప్రతినిధి అబ్దుల్ సమీ గురువారం తెలిపారు. ఉదయం 7.30 గంటలకే కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు జహీర్ అహమ్మద్ ప్రారంభిస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 8వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 94410 12296లో సంప్రదించాలన్నారు.

ఊపందుకున్న ప్రచారం

అనంతపురం సిటీ: తపాలా ఉద్యోగుల పరస్పర సహకార సంఘం (కోఆపరేటివ్ సొసైటీ) ఎన్నికల్లో భాగంగా ప్రచారం ఊపందుకుంది. తపాలా శాఖలో మొత్తం మూడు యూనియన్లు ఉండగా, అన్ని యూనియన్ల నుంచి అభ్యర్థులు సొసైటీ ఎన్నికల్లో డైరెక్టర్ పోస్టుల కోసం పోటీపడుతున్నారు. బరిలో 22 మంది అభ్యర్థులు ఉన్నారు. వారంతా జిల్లా అంతటా అన్ని సబ్, బ్రాంచ్ పోస్టాఫీసులకు తిరుగుతూ తమను గెలిపించాలని కోరుతున్నారు. ఈ నెల 7న పోలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో ప్రచారం ముమ్మరం చేశారు. పోటీ నువ్వా-నేనా అన్నట్లు సాగుతోంది. తమకు కేటాయించిన గుర్తులను చూపెడుతూ అభ్యర్థులు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ.. ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

కనగానపల్లి: మండలంలోని తగరకుంట, వేపకుంట గ్రామాల్లోని 35 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. గురువారం అనంతపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీ కండువాలు కప్పుకున్నట్లు మండల కన్వీనర్ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో తగరకుంట నేసే నాగన్న, మారెన్న, శివయ్య, అంజీ, వేపకుంట వెంకటప్ప, తదతరులు ఉన్నారు. 25 ఏళ్లుగా టీడీపీలో పని చేస్తున్నా పరిటాల కుటుంబం తమకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో కొచ్చిన తర్వాత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వపాలన నచ్చి పార్టీలోకి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, తగరకుంట ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నరసింహ జయంతి



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న రుత్వికులు

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెల తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న నరసింహస్వామి జయంతి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. స్థానిక పాతూరులోని చిన్నాంజనేయస్వామి ఆలయంలో ఉదయం వివిధ దేవతామూర్తులకు నిర్మాల్య విసర్జన, అభిషేకాలు, అర్చనలు, వివిధ రకాల పుష్పాలతో అలంకార సేవలు నిర్వహించారు. నయన మనోహరంగా సాగిన శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి కల్యాణోత్సవంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా సాగిన కల్యాణంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆత్మీయ అతిథిగా పాల్గొని, తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం ఆలయ నిర్వాహకులు రఘునాథాచార్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులతో నగరోత్సవం, సాంస్కృతిక సంబరాలు జరిగాయి.

డీడీపై ఖజానాశాఖ ఉద్యోగుల ఫిర్యాదు



జేడీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఖజానా ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు శంకరనారాయణ

అనంతపురం అర్బన్: ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని డిప్యూటీ డైరెక్టర్ సరళ విజయకుమారిపై ఖజానా శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు పి.శంకరనారాయణ తదితరులు జాయింట్ డైరెక్టర్ పూజారి శ్రీనివాసులు నాయక్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ఖజానా శాఖలో ఆడిటింగ్‌కు జిల్లా ఖజానా కార్యాలయానికి వచ్చిన జాయింట్ డైరెక్టర్‌ను డీడీ చాంబర్‌లో ఆమె సమక్షంలోనే కలిసి వినతి పత్రం అందజేసి పరిస్థితి వివరించారు. సీనియర్ అకౌంటెంట్లుగా (ఎస్‌ఏ) పదోన్నతి పొందేందుకు జూనియర్ అకౌంటెంట్లు (జేఏ) అర్హత సాధించి ఆరు నెలలవుతున్నా పదోన్నతులు కల్పించలేదని చెప్పారు. సబ్ ట్రెజరీల నుంచి వచ్చిన అర్జీలను నెలలుగా పరిష్కరించలేదన్నారు. ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవ్స్, ఈఎల్స్, ప్రొబేషన్స్, రెగ్యులరైజేషన్స్ చేయకుండా ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మండల అభివృద్ధికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంజలి

చెన్నేకొత్తపల్లి: మండల అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎంపీపీ మజ్జిగ అంజలి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంల ఎంపీడీఓ అశోక్ నాయక్, ఏఓ ఉదయ్ కుమార్, హౌసింగ్ ఎఈ హరినాయక్, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు డోలు రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ గాయత్రి, ఏపీఎం రఘునాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

10న ఆలయ భూముల కౌలు వేలం

నార్పల: గూగూడు గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి, అక్కదేవతలు, భైరవస్వామి ఆలయ భూముల కౌలు వేలాన్ని ఈ నెల 10న గూగూడులోని చెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు ఈఓ శోభ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ.1,000 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

6న కంటి వైద్య శిబిరం

రామగిరి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఈనెల 6న శనివారం శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పెటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మీనుగ నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

అసత్య ప్రచారాలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న దామాజిపల్లి గ్రామస్తులు

చెన్నేకొత్తపల్లి: గ్రామంలో మేము సొంతంగా కాలనీ వాసులంతా చందాలు వసూలు చేసుకొని డ్రైనేజీ నిర్మిస్తే.. పరిటాల సునీత సొంత నిధులతో నిర్మించారని పత్రికల్లో తప్పుడు కథనాలు రాయించడం సరికాదని దామాజిపల్లి గ్రామస్తులు అన్నారు. గ్రామస్తులు అక్కమ్మ, రాజి, నారాయణమ్మ, భారతి, గౌరమ్మ, లక్షన్న, నారాయణ, నిత్య, నాగేష్ తదితరులు గురువారం విలేకరులతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా కాలనీలో డ్రైనేజీ సమస్య ఉండటంతో కాలనీవాసులంతా స్వచ్ఛందంగా చందాలు వేసుకొని రూ.40 వేలు డబ్బు పోగేసుకొని డ్రైనేజీ నిర్మించుకున్నామన్నారు. డ్రెయినేజీ వద్ద టీడీపీ నాయకులు ఫొటోలు దిగి మాజీ మంత్రి పరిటాల సునీత సొంత నిధులతో నిర్మించారంటూ పచ్చపత్రికల్లో రాయించడం సరికాదన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ సభ్యుడు పవన్‌కుమార్‌రెడ్డి మాకు రూ.40 వేలు తిరిగి ఇచ్చారన్నారు.

బాధ్యతల స్వీకరణ



నూతన ఇంగ్లిష్ విభాగాధిపతి మాధవిని సన్మానిస్తున్న విద్యార్థులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్ నూతన విభాగాధిపతిగా డాక్టర్ వి. మాధవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి విభాగాధిపతిగా బాధ్యతలు అప్పగించిన వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డికి ఆమె ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని చెప్పారు.

ఆర్టీసీ బస్టాండు అద్దెకు టెండర్ల ఆహ్వానం

యాడికి: మండల కేంద్రంలో 3.91 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఆర్టీసీ బస్టాండును అద్దెకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తాడిపత్రి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకరయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 22 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 23న మధ్యాహ్నం టెండర్లు ఖరారు చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 7282860183, 9959225856 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ముందుచూపుతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

● నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి



నగరపాలక సంస్థలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: నగరంలో అభివృద్ధి పనులకు ముందుచూపుతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ రమణారెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. గురువారం నగరంలోని గౌరవగార్డెన్, గంగానగర్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. గౌరవ గార్డెన్‌లో నిర్మాణం పూర్తయిన మురుగు కాలువను పరిశీలించారు. గంగానగర్‌లో నూతన కాలువ ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలించారు. మురుగు సక్రమంగా వెళ్లేలా నిర్మాణం చేపట్టాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.

క్లాప్ ఆటోలపై అవగాహన:

క్లాప్ ఆటోల ద్వారా చేపడుతున్న చెత్త సేకరణ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు యూజర్ చార్జీలను వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని మెప్మా సిబ్బంది, నోడల్ ఆఫీసర్లను కమిషనర్ ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థలో సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. 60 శాతం కూడా యూజర్ చార్జీలను వసూలు చేయలేని సిబ్బంది ఆయన అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. సచివాలయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, వారి పనితీరుపై తనకు నివేదిక సమర్పించాలని నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

అనంతపురం రూరల్: చంద్రబాబునగర్‌లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్‌వలి, రుద్రంపేట ఎంపీటీసీ-4 మహబూబీ గురువారం భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి ,సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో రుద్రంపేట పంచాయతీ అభివృద్ధిని టీడీపీ నాయకులు పూర్తిగా విస్మరించారన్నారు. ఎమ్మెల్యే అనంత ప్రత్యేక చొరవతో రూ.కోట్ల నిధులతో రుద్రంపేట పంచాయతీని అభివృద్ధి చేశారన్నారు. ఎమ్మెల్యే, సర్పంచ్ సహకారంతో చంద్రబాబునగర్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణనాయక్, వెంకటరాముడు, అక్కమ్మ, ఖాజా, జయమ్మ పాల్గొన్నారు.

నలుగురికి గాయాలు

గార్లదిన్నె: తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, తెలిపిన వివరాలు.. పామిడి నుంచి అనంతపురముకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో తిమ్మంపేట వద్దకు రాగానే డ్రైవర్ వేగాన్ని తగ్గించాడు. వెనుక వస్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి ఆటోను వెనుక వైపు ఢీకొంది. ఘటనలో ఆటోడ్రైవర్ గంగరాజు, ప్రయాణికులు శ్రీదేవి,కామాక్షి, సాయి రక్తగాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గురుమూర్తి తెలిపారు.

వర్షానికి దెబ్బతిన్న వరి పంట పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

రాప్తాడురూరల్: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న అనంతపురం రూరల్ మండలం సాములదొడ్డి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో వరి పొలాలను గురువారం అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, ఏడీఏ వెంకటరాముడు, ఏఓ వెంకటేశ్వరప్రసాద్, పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ రమణ తదితరులు పంటను పరిశీలించారు. వరిలో పొడవు రకం కాకుండా పొట్టిరకం వరి నాటడం వల్ల గాలికి, వర్షానికి ఎక్కువగా పడిపోవన్నారు. వరి పంటలు ఏప్రిల్ నెలలోపే కోతకోసేలాగా ముందుగానే నాట్లు వేసుకోవాలన్నారు. మూడేళ్లకోసారి వరిపొలం పంట మార్పిడి చేయాలన్నారు. గాలికి, వర్షానికి పడిపోయిన గింజలు మొలకెత్తకుండా ఉప్పు ద్రవరణం స్ప్రే చేయాలన్నారు. దుక్కిలో ఎస్ఎస్‌పీ, డీఏపీని వాడాలన్నారు. బయోఫర్టిలైజర్, పశువుల ఎరువును వరి పొలాలకు వాడితే మంచి దిగుబడి వస్తుందన్నారు. అధికారులు వెంట పలువురు రైతులు ఉన్నారు.

విపత్తుల నివారణకు కంట్రోల్ రూము ఏర్పాటు

గుంతకల్లు రూరల్: భారీ వర్షాల కారణంగా విపత్తులు సంభవించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో విపత్తుల నివారణ కోసం కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 గంటల పాటు కంట్రోల్ రూము అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. భారీ వర్షాలతో ఎక్కడ ఎటువంటి విపత్తు సంభవించిన వెంటనే 9885622029 (ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ) , 9502716847 (రాత్రి 8 గంటల నుంచిఉదయం 8 గంటల వరకూ) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

● ప్రయాణం.. పరవశం

ప్రయాణ మంటే అదో అనుభూతి..
రహదారిపై ప్రయాణమంటే ఇష్టపడని వారుండరు.. వేసవిలో దూర ప్రయాణం చేయడం భారమే అయినా.. మే నెలలో మండిపోవాల్సిన ఎండలు .. వారం రోజులుగా వర్షాకాలాన్ని తలపిస్తోంది. కాస్త మేఘాలు కమ్ముకోవడంతో ఆకాశం చల్లబడుతోంది. ఎండుముఖం పట్టిన చెట్లు పచ్చగా చిగురించాయి. కనుచూపు మేర ఆహ్లాకర వాతారణం కనిపిస్తోంది. అనంతపురం - హైదరాబాదు జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులను కనువిందు చేస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సోములదొడ్డి నుంచి లోలూరు క్రాస్ సమీపంలో పచ్చని చెట్లతో కనువిందు చేస్తున్న జాతీయ రహదారి

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

గార్లదిన్నె: అకాల వర్షంతో నేలకొరిగిన వరి ధాన్యం మొలకెత్తకుండా రైతులు ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని రేకులకుంట ఏఆర్ఎస్ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ రమణ పేర్కొన్నారు. గురువారం ముంటిమడుగులో వ్యవసాయ శాఖ ఏడీ వెంకటరాముడుతో కలిసి ఆయన అకాల వర్షం వల్ల దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ మండలంలో నాలుగు రోజుల్లో 118.8 ఎంఎం వర్ష పాతం నమోదు కావడంతో 565 ఎకరాల్లో వరి, మొక్కజొన్న 17 ఎకరాలు, వేరుశనగ 3 ఎకరాలు, పత్తి 3 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. వరి పంట పడిపోతే ధాన్యం మొలకెత్తకుండా ఎకరాకు 50 గ్రాముల ఉప్పు, 5 లీటర్లు నీటికి కలుపుకొని ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. వరి పంట ఏప్రిల్‌లో కోతకు వచ్చేలా నాట్లు వేసుకోవాలన్నారు. ప్రతి మూడేళ్లకోసారి పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. ఏఓ సోమశేఖర్, సచివాలయ సిబ్బంది, రైతు లు పాల్గొన్నారు.